జగనన్న సురక్షతో పేదలకు మేలు

- చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దు
- వలంటీర్లను దూషిస్తున్న పవన్‌కు తగిన బుద్ధి చెప్పండి
- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్‌: అర్హత ఉన్నా వివిధ సర్టిఫికెట్లు లేని కారణంగా సంక్షేమ పథకాలు పొందని వారి సమస్యలను సత్వరమే పరిష్కరించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలో 32, 12, 26, 13, వార్డుల్లో కౌన్సిలర్లు వై.సుధాకర్‌, పెద్ద వెంకటేశ్వర్లు, లక్ష్మీ, వార్డ్‌ ఇన్‌చార్జ్‌ హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. ఈ సభలకు హాజరైన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. అర్హత ఉన్న ఏ ఒక్కరూ నష్టపోకూడదని భావించిన సీఎం వైఎస్‌ జగన్‌ ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. సంక్షేమ రథసారథి సీఎం జగన్‌మోహన్‌ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అనంతరం 11 రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్‌యార్డు చైర్మన్‌ ఎస్‌వీఆర్‌ మోహన్‌, అసిస్టెంట్‌ కమిషనర్‌ లావణ్య, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్‌, సీఎంఎం భవాని, సీఓ మధు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ చంద్రశేఖర్‌, వీరశైవలింగాయత్‌ కార్పొరేషన్‌ రాష్ట్ర డైరెక్టర్‌ యుగంధర్‌రెడ్డి, మాజీ మున్సిపల్‌ చైర్మెన్లు రామలింగప్ప, జింకల రామాంజినేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు బి.సుంకప్ప, మాజీ కౌన్సిలర్‌ సుంకప్ప, సీనియర్‌ నాయకులు మల్లికార్జున శాస్త్రి, త్యాగరాజు, లోకిరెడ్డి, నూర్‌నిజామి, ఎల్లప్ప, సచివాలయ కన్వీనర్‌ ఖలీల్‌, తదితరులు పాల్గొన్నారు.

మభ్యపెట్టేందుకే 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో ప్రజలను మరో మారు మభ్యపెట్టేందుకు చంద్రబాబు వస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు మాటలు నమ్మితే మళ్లీ మోసపోతారన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీలో హామీలు చేసి నట్టేట ముంచిగిపోవద్దని ప్రజలకు సూచించారు. సీఎం జగన్‌ అవినీతి, అక్రమాలకు తావులేకుండా డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లోకి సంక్షేమ పథకాల సొమ్మును జమ చేస్తున్నారన్నారు. సీఎం జగనన్నను చూసి ఓర్వలేక రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందని గగ్గోలు పెట్టిన మోసకారి చంద్రబాబు అన్నారు. ఇప్పుడెలా హామీలిస్తున్నారని ప్రశ్నించారు. ఇంటికి కేజీ బంగారం, కారు ఇస్తానని హామీలిచ్చినా నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు.

వలంటీర్లను దూషించడం దుర్మార్గం

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సేవావారధుల్లా పని చేస్తున్న వలంటీర్లను ఉమెన్‌ ట్రాఫికర్లుగా అభివర్ణించిన జనసేన అధినేత పావలా కళ్యాణ్‌కు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. సరిగ్గా నిలబడటం కూడా చేతకాని పవన్‌ ప్రజలకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు.

డ్రైనేజీ పనులు ప్రారంభించాలి

గుంతకల్లుటౌన్‌: పట్టణంలోని షికారీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులను వారంలోపు ప్రారంభించాలని మున్సిపల్‌ అధికారులకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సూచించారు. సోమవారం 32వ వార్డులోని షికారీ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. షికారీల సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీల్లేని కారణంగా వర్షపు, మురికి నీరంతా ఇళ్ల ముంగిటే నిలుస్తుండటంతో దుర్వాసన వస్తోందని పలువురు తెలిపారు. డ్రైనేజీ నిర్మాణానికి టెండర్లు ముగిసినా పనుల ప్రారంభానికి ఆలస్యమెందుకని అడిగి తెలుసుకున్నారు. వెంటనే పనులు షురూ చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే నక్కల షికారీలైన తమకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు. ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ వై.సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

కళాక్షేత్రం ఏర్పాటుకు సహకరించండి

గుంతకల్లు: కళాకారుల సౌకర్యార్థం పట్టణంలో కళాక్షేత్రం ఏర్పాటుకు స్థలం కేటాయించి, భవనం నిర్మించేందుకు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డికి పట్టణ కళాకారులు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వైవీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పట్టణం, మండలంలో వందల మంది కళాకారులు ఉన్నారన్నారు. కళాక్షేత్రం లేకపోవడంతో సమావేశాలను పార్కులు, ఖాళీ ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాకారుల సౌకర్యార్థం పట్టణంలో భవనం నిర్మించి, ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి కళాకారులు పీసీ కుల్లాయప్ప, టి.పుల్లయ్య, శుభోదయ ఆర్ట్‌ తరుపున చలపతి, శ్రీ వేంకటేశ్వర కళానికేతన్‌ భగవంతప్ప, లక్ష్మపతి, పరంజ్యోతి నాటక కళా సమితి వరదామయ్య, ఘంటసాల ఆర్కెస్ట్రా శ్రీనివాసం రెడ్డి, రంగస్థల కళాకారులు రైల్వే ఇంగ్లిష్‌ మీడియం హైస్కూల్‌ ఇన్‌చార్జ్‌ ప్రిన్సిపాల్‌ సుధాకర్‌, పద్మశ్రీ ఘంటసాల కల్చరల్‌–రూరల్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ తరఫున త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చీనీ చెట్ల ధ్వంసం

గార్లదిన్నె: మండల పరిధిలోని పెనకచెర్లకు చెందిన రైతు నరసింహారెడ్డికి చెందిన 18 చీనీ చెట్లను అదే గ్రామానికి చెందిన సంజీవరెడ్డి అనే వ్యక్తి ధ్వంసం చేసినట్లు సోమవారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదైంది. రైతు నరసింహారెడ్డి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొహర్రం వేడుకలకు అనుమతి తప్పనిసరి

బుక్కరాయసముద్రం: గ్రామాల్లో మొహర్రం పండుగ నిర్వహణకు పోలీసుల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో పీర్ల పండుగ నిర్వహించాలనుకునే వారు ముందుగా కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రశాంతంగా పీర్ల పండుగను జరుపుకోవాలన్నారు. డీజే సౌండ్లు తప్పెట్లతో డ్యాన్స్‌ చేయరాదన్నారు. గ్రామాల్లో తప్పతాగి డ్యాన్స్‌ చేస్తూ వీరంగం సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొడవలు జరిగితే కమిటీ పూర్తి బాధ్యత వహించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా వాహనాల వేలం

గార్లదిన్నె: అనంతపురం ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ ఆదేశాలతో వివిధ ఎక్సైజ్‌ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్‌ సీఐ హసీనాబేగం ఆధ్వర్యంలో 18 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను వేలం వేశారు. 15 ద్విచక్ర వాహనాలను పలువురు కొనుగోలు చేశారు. ప్రభుత్వానికి రూ.2.64 లక్షల ఆదాయం వచ్చిందని ఎస్‌ఐ సాగర్‌ తెలిపారు.

క్లుప్తంగా

శ్రీచైతన్య మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా సుహాసిని



బుక్కరాయసముద్రం: స్థానిక శ్రీచైతన్య మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా చెన్నంపల్లి గ్రామానికి చెందిన సుహాసినిని ఎన్నుకున్నట్లు ఏపీఎం మద్దిలేటి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శ్రీచైతన్య మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా సుహాసి, కార్యదర్శిగా మాధవి (రోటరీపురం) ఉపాధ్యక్షురాలిగా అరుణ (కేవీఎస్‌ నగర్‌) ఉప కార్యదర్శిగా నాగలక్ష్మి (బీకేఎస్‌)ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు సుహాసిని మాట్లాడుతూ.. మండలంలో సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సభ్యులకు అందేలా చర్యలు చేపడుతామన్నారు.

సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్‌ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో చైతన్య మండల సమాఖ్య 28వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి మహిళ సంఘంలో చేరాలన్నారు. సంఘాల ద్వారా కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. మహిళలు పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ పార్వతి, వెటర్నరీ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రత్నకుమార్‌, ఏపీఎం మద్దిలేటి, జేసీఎస్‌ మండల కన్వీనర్‌ బయప రెడ్డి సంఘాల ప్రతినిధులు, సభ్యులు ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


టగ్‌ ఆఫ్‌ వార్‌ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం


పెద్దపప్పూరు: ఇటీవల తమిళనాడులోని ఈరోడ్‌లో జరిగిన టగ్‌ ఆఫ్‌ వార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జాతీయస్థాయి టగ్‌ ఆఫ్‌ వార్‌ పోటీల్లో మండల పరిధిలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఐదో స్థానంలో నిలిచారు. సోమవారం స్థానిక పాఠశాలలో జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన షబానా, నాగమైత్రి, నిహారిక, శ్రీహరిణి, స్నేహ, వైష్ణవిని ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, పీడీ రామాంజినమ్మ ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్బీకేల్లో ఈ–కేవైసీ నమోదు


వెస్ట్‌ నరసాపురం ఆర్బీకేలో ఈ–కేవైసీ చేస్తున్న ఏఈఓ అక్కమ్మ

శింగనమల: పీఎం కిసాన్‌కు ఈ–కేవైసీ చేయించుకోని రైతులు వెంటనే ఆర్బీకేల్లో ఈ–కేవైసీ నమోదు చేయించుకోవాలని ఏఓ అన్వేష్‌ కుమార్‌ తెలిపారు. సోమవారం మండలంలోని వెస్ట్‌ నరసాపురం, ఆకులేడు ఆర్బీకేల్లో పీఎం కిసాన్‌కు ఈ–కేవైసీ నమోదు చేయించారు. వెస్ట్‌ నరసాపురంలో ఏఈఓ అక్కమ్మ, వ్యవసాయ సిబ్బంది నవీన్‌, సంధ్య, ఆకులేడు ఆర్బీకేలో వ్యవసాయ సిబ్బంది అమరేష్‌, రాజేశ్వరి, ఆదినారాయణ ఈ–కేవైసీ నమోదు చేస్తారని తెలిపారు. సెల్‌ఫోన్‌ ఓటీపీ ద్వారా ఈ–కేవైసీ చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 28వ తేదీ వరకూ ఆర్బీకేల్లో ఈ–కేవైసీ చేయించుకునేందుకు అవకాశం ఉందన్నారు.

అయ్యంకి సేవలు అమోఘం


అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి కృష్ణ

శింగనమల: గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన అయ్యంకి వెంకటరమణయ్య సేవలు మరువలేనివని గ్రంథాలయ అధికారి కృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్‌ లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి


ఇళ్ల నిర్మాణ పనులపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: తాడిపత్రి ప్రాంతంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం పరిశీలించారు. రూరల్‌ పరిధిలోని ఆర్టీటీ కాలనీలో కొనసాగుతున్న టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఇళ్ల నిర్మాణ పనులపై కాంట్రాక్టర్లతో చర్చించారు. 85 బ్లాక్‌లలో ఇళ్ల నిర్మాణాలు దాదాపుగా పూర్తి అయ్యాయని కాంట్రాక్టర్లు తెలిపారు. ఇళ్లకు తుది మెరుగులు దిద్దుతున్నట్లు వివరించారు. రెండు నెలల్లో దాదాపు 3 వేల గృహాలను లబ్ధిదారులకు అందించేలా పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మరో రెండు నెలల్లో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అక్కడ నుంచి అంబేడ్కర్‌ నగర్‌లో పర్యటించారు. అక్కడి ప్రజలు విద్యుత్‌ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్‌ వైర్లు కిందకు వేలాడుతున్నాయని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విద్యుత్‌ శాఖాధికారులతో మాట్లాడారు. కాలనీలో అవసరమైన విద్యుత్‌ స్తంభాలను ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. అలాగే తాడిపత్రిలో ఎక్కడైనా సరే ఇనుప విద్యుత్‌ స్తంభాలు ఉన్నా వాటిని తక్షణమే తొలగించాలన్నారు. వాటి స్థానంలో సిమెంట్‌ విద్యుత్‌ స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే విద్యుత్‌ స్తంభాలు అవసరమైన చోట తప్పనిసరిగా స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు ఎలా జరుగుతున్నాయి? ఎప్పటికి పూర్తవుతాయని కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన వంద పడకల ఆసుపత్రిని పూర్తి చేయాలన్నారు. పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

విద్యతోనే దేశాభివృద్ధి


పామిడి: చిన్నారులకు ప్రీ స్కూల్‌ కిట్లు అందజేస్తున్న ఏడీసీసీ బ్యాంక్‌ చైర్‌పర్సన్‌ లిఖిత


పక్కీరప్ప కాలనీలో ప్రీ స్కూల్‌ కిట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్‌ మెహరున్నీసా

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ విద్యకు పెద్దపీట వేశారని ఏడీసీసీ బ్యాంక్‌ చైర్‌పర్సన్‌ ఎం.లిఖిత అన్నారు. సోమవారం పట్టణంలోని దత్తాత్రేయ వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్‌ కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాలు–2, 4, 8తో పాటు తగ్గు దేవాలయం, ఆర్టీసీ బస్టాండ్‌, కాల్వగడ్డ వీధికి చెందిన మొత్తం ఆరు అంగన్‌వాడీ కేంద్రాల్లోని 50 మంది విద్యార్థులకు ప్రీస్కూల్‌ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏడీసీసీ బ్యాంక్‌ చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ.. కేజీ నుంచి పీజీ దాకా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వం విద్యనందిస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి, ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ రామలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు జయంతి, భారతి, జేఎల్‌ నారాయణమ్మ, త్రివేణి, ఫకృన్నీసా, ఎంఎస్‌కేలు శిల్ప, రాధ పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్‌: పట్టణంలోని బెంచికొట్టాల, భాగ్యనగర్‌, పోర్టర్స్‌లైన్‌, బీటీ పక్కీరప్ప కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీ స్కూల్‌ కిట్లు అందజేశారు. సోమవారం ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో కౌన్సిలర్లు జేసీబీ. దాండ్‌బాష, షరీఫ్‌, మెహరున్నీసాల చేతుల మీదుగా కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు పుష్పావతి, శ్రీదేవి, పాల్గొన్నారు.

గ్రామాల్లో మొహర్రం సందడి


యల్లనూరు అచ్చుకట్ల వీధిలో కొలువుదీరిన పీర్లు

పామిడి: పట్టణంలోని షాదీఖానాలోని గౌసియా పీర్ల మకాన్‌లో సోమవారం హజరత్‌ ఇమామ్‌ హుసేన్‌, హుసేన్‌, మౌలాలీ పీర్లస్వాములు కొలువుదీరారు. మకాన్‌ నిర్వాహకులు 5వ ఖాన్‌ను పురస్కరించుకుని పీర్లస్వాములను శోభాయానంగా అలంకరించి కొలువుదీర్చారు. అనంతరం ముజావర్లు పీర్లస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

యల్లనూరు: మండలంలోని యల్లనూరు, సింగవరం, చింతకాయమంద, బొప్పేపల్లి తదితర గ్రామాల్లోని మకానాల్లో సోమవారం పీర్లు కొలువుదీరాయి. ఎస్‌ఐ రామకృష్ణ ఆయా గ్రామాల్లో పర్యటించారు. మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ముస్లిం మత పెద్దలు, ముజావర్లకు సూచించారు. ఏదైనా గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపుతామన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

బుక్కరాయసముద్రం: ప్రస్తుతం సమాజంలో బాలికలకు ప్రభుత్వ చట్టాలపై అవగాహన అవసరమని మండల సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కొర్రపాడు వద్ద ఉన్న డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల బాలికల పాఠశాలలో దిశా, ప్రభుత్వ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బాలికలు, మహిళలు సెల్‌ఫోన్లు వాడే సమయంలో అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. పరిచయం లేని వ్యక్తులకు సమాచారం ఇవ్వడం చాలా ప్రమాదకరమని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే పోలీసులు, 100 నంబర్‌కు ఫోన్‌ చేయాలన్నారు. అనంతరం మహిళా చట్టాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పాముకాటుతో అస్వస్థత

గుత్తి రూరల్‌: మండలంలోని ఎంగిలిబండ గ్రామంలో కంబయ్య అనే రైతు పాముకాటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బాధితుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కంబయ్య ఆదివారం అర్ధరాత్రి ఇంటి బయట ఉండగా పాము కాటు వేసింది. పాము ఎడమ కాలికి చుట్టుకోవడంతో ఎంత విదిల్చినా వదల్లేదు. కంబయ్య బిగ్గరగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వచ్చి పామును చంపేశారు. ఈ ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన కంబయ్యను కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకు అనంతపురం సర్వజనాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు అందుకున్న పారిశుధ్య కార్మికులతో జొన్నలగడ్డ నిర్మల దేవి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిత్యావసర సరుకులు ఉచితంగా అందజేశారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అమ్మ జొన్నలగడ్డ నిర్మలదేవి సొంత నిధులతో ఎమ్మెల్యే కుమారుడు ఆలూరు విరాట్‌ చేతుల మీదుగా 40 మంది కార్మికులకు సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో పని చేస్తున్న దాదాపు 317 మంది పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. అనంతరం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జొన్నలగడ్డ నిర్మలదేవికి పారిశుద్ధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఎర్రగుడి గ్రామస్తుడు


పోలీసుల సమక్షంలో మౌనికకు హ్యాండ్‌ బ్యాగ్‌ అందజేస్తున్న అంజనేయులు

గుత్తి: తనకు దొరికిన హ్యాండ్‌ బ్యాగ్‌ను బాధితులకు అందజేసి నిజాయితీ చాటుకున్నాడు ఆంజనేయులు అనే వ్యక్తి. వివరాలు ఇలా.. యాడికి మండలం చందన గ్రామానికి చెందిన నవీన్‌ కుమార్‌, మౌనిక దంపతులు పని మీద బైక్‌లో గుంతకల్లుకు బయలు దేరారు. ఈ క్రమంలో గుత్తి పట్టణ శివారులోని చెరువు కట్ట సమీపంలో రోడ్డు పక్కన హ్యాండ్‌ బ్యాగ్‌ పడిపోయింది. దాన్ని ఆ దంపతులు గమనించలేదు. ఆ బ్యాగ్‌ ఎర్రగుడి గ్రామానికి చెందిన ఆంజనేయులు అలియాస్‌ కిట్టుకు దొరకడంతో పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. హ్యాండ్‌ బ్యాగ్‌ను పరిశీలించిన పోలీసులు.. అందులో ఒక జత బంగారు కమ్మలు, వెండి పట్టీలు, సెల్‌ఫోన్‌తో పాటు రూ.1,000 నగదు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మౌనికకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి, హెడ్‌ కానిస్టేబుల్‌ ప్రకాశం సమక్షంలో అంజనేయులు బాధిత మహిళకు హ్యాండ్‌ బ్యాగ్‌ అందజేశాడు.

డ్రైవర్‌ కుటుంబానికి ఇన్సూరెన్స్‌ మంజూరు


మృతుడి భార్య కమలమ్మకు చెక్కు అందజేస్తున్న అధికారులు

గుత్తి: స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న ఆర్‌.రవి సెప్టెంబర్‌ 30, 2020న మరణించారు. ఎంప్లాయ్‌ డిపాజిట్‌ లింక్డ్‌ ఇన్సూరెన్స్‌ స్కీమ్‌ (ఈడీఎల్‌ఐఎఫ్‌) ద్వారా డ్రైవర్‌ కుటుంబానికి రూ.5,72,307 ఇన్సూరెన్స్‌ మంజూరైంది. సోమవారం స్థానిక డిపోలో మృతుడి భార్య కమలమ్మకు డిపో అధికారులు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్‌ అవధాని శ్రీపాద, ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల పట్టాలివ్వాలి

గార్లదిన్నె: అర్హులైన లబ్ధిదారులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తహసీల్దార్‌ను కోరారు. మండల పరిధిలోని యర్రగుంట్లలో ఇంటి స్థలం లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ సిబ్బంది అర్హులను గుర్తించి జగనన్న కాలనీలో ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌ ఉషారాణికి అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అక్బర్‌, సుబ్బన్న, మల్లన్న, కొండన్న, ఎల్లమ్మ, బాలిరెడ్డి, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

పుట్లూరు: మడుగుపల్లి, మడ్డిపల్లి, కుమ్మనమల, చెర్లోపల్లి గ్రామాల్లో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్‌ హెల్త్‌ క్లినిక్‌లను మంగళవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు.

అర్హులకు పారదర్శకంగా సంక్షేమ ఫలాలు


జేపీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న యువనాయకుడు కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని యువ నాయకుడు కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గన్నెవారిపల్లి సచివాలయం–2 పరిధిలో 5వ రోజు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగేళ్లల్లో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని తెలియజేశారు. అలాగే కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులకు పథకాలు అందించేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజల ఆర్థికాభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేసిందని తెలిపారు. పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలను ఉన్నతాధికారులకు వివరిస్తామన్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవికుమార్‌, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, ప్రభాకర్‌, గురుప్రసాద్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ: ఇద్దరికి గాయాలు


గాయపడిన ఆటోడ్రైవర్‌ సుబ్బారాయుడు

పెద్దవడుగూరు: మండల పరిధిలోని క్రిష్టిపాడు సమీపంలో నిమ్మకాయల లోడ్‌తో వెళ్తున్న ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో క్రిష్టిపాడు గ్రామానికి చెందిన సుబ్బారాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సుబ్బారాయుడు ఆదివారం రాత్రి రాయలచెరువు నుంచి నిమ్మకాయల లోడ్‌తో గుత్తి వైపునకు వెళ్తుండగా.. గుత్తి వైపు నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్‌ సుబ్బారాయుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు అతడి వైద్య చికిత్సకు గుత్తికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించినట్లు పోలీసులు తెలిపారు.